
# సహారా

సామర్ల రమేష్



**డహరన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్**
**జుబైల్, సౌదీ అరేబియా**

చెకింగ్‌లన్నీ పూర్తి చేసుకుని 'కేతన్' విమానంలోకి అడుగుపెట్టాడు. ఎదురుగా ఎంట్రన్స్ ప్రక్కనే అలవాటైన, ఆహ్లాదకరమైన చిరునవ్వుతో ఎయిర్ హోస్టెస్ నిలబడి వున్నది. కానీ ఆ నవ్వు కేతన్ మొహంలోని దిగులుని పారద్రోల లేకపోయింది.

ముభావంగా తన సీటునంబర్ చెప్పాడు. ఆమె ఎటువెళ్లాలో చెప్పింది. తన లాగానే సీట్లు వెతుక్కుంటున్న వాళ్లమధ్య నుండి వెళ్లి తన సీట్లో నిరాసక్తిగా కూర్చున్నాడు. పాసింజర్లందరూ వచ్చారని నిర్ధారించుకున్న తర్వాత విమానం డోర్ మూశారు. డోర్ మూసిన విషయం కాక్‌పిట్ నుండి ఎనౌన్స్ చేశారు.

ఎయిర్‌హోస్టెస్ అందరి దగ్గరకొచ్చి బెల్ట్ ఆక్సిజన్ మాస్క్, ఇయర్ ప్లగ్స్ ఎలా ధరించాలో చెప్పింది. ఎమర్జెన్సీ ప్రొసీజర్ గురించి, ఎమర్జెన్సీ డోర్ గురించి క్లుప్తంగా వివరించి వెళ్లింది.

"వుయార్ గోయింగ్ టు టేకాఫ్... ప్లీజ్ వియర్ బెల్ట్ ప్లీజ్ డోంట్ యూజ్ ఎనీ ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్, రేడియో, మొబైల్ ఫోన్ ఎక్స్‌ట్రా" కాక్‌పిట్ నుండి ఎనౌన్స్‌మెంట్.

ఎయిర్ హోస్టెస్ వచ్చి అందరూ బెల్ట్‌లు ధరించారని, ఎవరిదగ్గరా ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్స్ లేవని నిర్ధారించుకుని పైలెట్‌కి మెస్సేజ్ అందించింది.

నెమ్మదిగా విమానం కదిలింది. కేతన్ టైం చూశాడు. అయిదు గంటలు... సమయం సాయంత్రం అయిదయిందనీ, పైగా ఆరోజు ఆదివారమనీ అర్థం కాగానే ఒక్కసారిగా హృదయమంతా వేదనాభరితం అయింది. ఆ టైం గత రెండు సంవత్సరాలుగా అతనికి ఎంతో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని కలిగించింది. అదే రోజు, అదే సమయంలో ఆ ఊరికి వీడ్కోలు చెప్పాల్సి రావడం గుండెని పిండేస్తుంది. హృదయంలోని మంట 'హైడ్రోజన్'ని సృష్టిస్తే, వేడి నిట్టూర్పు ఆక్సిజన్‌ని అందిస్తే ఆ రెండూ కన్నీరుగా మారి కళ్లని మసకగా మార్చాయి. ఆ మసకవేదనలో విమానం తన మార్గమైన ముప్పైమూడు వేల అడుగులకు చేరుకుందని, వేగాన్ని పెంచుకుందని గమనించలేదు.

000

ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్...

కంప్యూటర్ ముందు కూర్చుని ఇంటర్‌నెట్ జోక్‌లు చదువుతున్న కేతన్ ఇంటర్‌కమ్ లిఫ్ట్ చేశాడు.

"హలో..."


"హాయ్ కేతన్... ఆర్యూబిజీ!" అవతలివైపు లియో.

"నో... నథింగ్...

## హిమపత్రాలు

భూమి గురించిన వర్తమానాన్నీ, భవిష్యత్తునూ అవగతం చేసుకునేందుకూ, వాతావరణరీతులను అంచనా వేసేందుకూ శాస్త్రవేత్తలు ఇప్పుడు భూమి గతాన్ని తిరగేస్తున్నారు. చెట్లు కాండం మధ్యన ఉండే వలయాలు, సముద్రంలోని ఇసుకమేటలు, మంచుఖండాల దిగువ నుంచి తీసే మంచుముక్కలు మొదలైనవి విశేషమైన సమాచారాన్ని తెలియజేస్తాయి. గ్రీన్‌లాండ్, అంటార్కిటికాల నుంచి తవ్వి తీసిన మంచుముక్కలను ప్రపంచవాతావరణం పూర్వవివరాలు తెలియజెప్పే 'హిమపత్రాలు'గా శాస్త్రవేత్తలు అభివర్ణిస్తున్నారు. మంచు కేంద్రకాలు లక్ష సంవత్సరాలూ, అంతకు పూర్వం నాటి ప్రపంచవాతావరణ పరిస్థితుల 'రికార్డులను' వెల్లడిస్తాయి. చివరి మంచుయుగం 'విస్కాన్సిస్' పదివేల ఏళ్లక్రితం అంతమైనట్లు ఈ రికార్డులు తెలియజేస్తున్నాయి. అప్పటి నుంచీ కూడా ప్రపంచవ్యాప్తంగా వాతావరణం వేడెక్కుతోందనీ, కాకపోతే గతశతాబ్దకాలంగా వాతావరణంలో చల్లదనం ఏర్పడిందనీ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

సి.వి.ఎస్.



అయామ్ రీడింగ్ జోక్స్..."

"లెటజ్ గోటు ఫిషింగ్" లియో ఉత్సాహంగా అడిగాడు.

సౌదీలోని ప్రముఖ ఇండస్ట్రియల్ సిటీ జుబైల్‌లో ఉన్న ఆయిల్ రిఫైనరీ 'ఏపియల్'లో కేతన్ షిఫ్ట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు.

అదే కంపెనీలో 'లియో' పేనల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరి వీక్లీ ఆఫ్ ఒక్కటే కావడంతో కేడర్‌లో కొద్దిగా తేడావున్నా ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. లియో ఫిలిప్పినో. ఇంకా ఎన్నో దేశాలకు చెందినవాళ్లు అందులో పనిచేస్తున్నారు. ఆరోజు ఆదివారం వర్క్‌లోడ్ తక్కువగా ఉంది. అలాంటి రోజుల్లో దగ్గర్లో ఉన్న ఎర్రసముద్రతీరానికి ఫిషింగ్‌కు వెళ్లడం వాళ్లకి అలవాటే.

ఇద్దరూ కలసి నిస్సాన్ జీపులో బయలుదేరారు. లియో తన పనిని ఇంకొకరికి అప్పజెప్పాడు. కంపెనీ కాంపౌండ్ దాటి రోడ్‌మీదకి వచ్చిన తర్వాత కేతన్ జీప్ స్పీడ్ పెంచి స్లోట్రాక్ నుండి మిడిల్‌ట్రాక్‌లోకి అక్కడినుండి ఫాస్ట్‌ట్రాక్‌లోకి పోనిచ్చాడు. జీప్ వందకిలోమీటర్ల వేగంతో వెళుతోంది. అప్పుడు సాయంత్రం నాలుగు కావస్తోంది. పదినిమిషాల్లో బీచ్‌కి చేరుకున్నారు. లియో జీప్‌లోనుండి గేలం బయటికి తీశాడు. పెద్దస్టీల్‌రాడ్‌కి చిన్న మోటార్ అమర్చివుంది. స్విచ్ నొక్కితే వైరు ముందుకి వెనుకకీ మూవ్ అవుతుంది. ఇసుకలో తిరుగుతున్న చిన్న పీతని పట్టుకుని ఎరగా గుచ్చారు.

అరగంట గడిచింది. ఏమీ తగల్లేదు. లియోలో అసహనం పెరిగిపోతోంది "కేతన్... అనవసరంగా వచ్చినట్లున్నాం"

"ఏం ఫర్వాలేదు... ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'మషేర్' ఈరోజు మనకి దొరకాలి" సౌదీలో మషేర్ చేపంటే అందరికీ ఎంతో ఇష్టం. చాలా రుచిగా ఉంటుంది.

"మషేర్ కాదుకదా, కింగ్‌రే కూడా దొరికేటట్లు లేదు" కింగ్‌రే వళ్లంతా ముళ్లు తినడానికి ఎవరూ పెద్దగా ఆసక్తి చూపించరు.

మరో పదినిమిషాలు గడిచాయి... ఫలితం లేదు... లియో ఏదో అనబోయాడు ఇంతలో బలంగా ఓ కుదుపు. ఇద్దరూ వెంటనే ఎలర్ట్ అయి గేలాన్ని గట్టిగా పట్టుకున్నారు.

"లియో... స్టార్ట్ మోటార్" కేతన్ పెద్దగా అరిచాడు.

లియో రివర్స్ బటన్ నొక్కాడు. గేలం వేరు భారంగా వెనక్కి రాసాగింది. ఒడ్డుకి రాగానే ఇద్దరూ ఒకరినొకరు గట్టిగా కౌగలించుకున్నారు... కారణం... అది 'మషేర్' దాదాపు పదికిలోలుంటుంది.

వాళ్లు తిరిగి వెళ్లేటప్పటికి అయిదు కావస్తోంది. కేతన్ తనరూమ్‌కు వెళ్లి కూర్చున్నాడు. ఎక్సైటింగ్‌గా ఉంది. మషేర్ గుర్తుకు వస్తుంటే నోట్లో లాలాజలం ఊరుతోంది. వెంటన్ క్వార్టర్స్‌కి ఫోన్ చేసి రూమ్మేట్ 'పెట్రాన్'కి విషయం చెప్పాడు. అతనూ చాలా సంతోషించాడు. ఫోన్ పెట్టేసి కంట్రోల్ రూంకి బయలు దేరబోతుండగా 'ఎక్స్టర్నల్' ఫోన్ మ్రోగింది. జి.ఎం. అయివుండొచ్చు అనుకుంటూ లిఫ్ట్ చేశాడు.

"హలో..." మృదువుగా అన్నాడు.

"హ... హలో" అస్పష్టమైన ఆడగొంతు.

రాంగ్‌నంబర్ అనుకుంటూ, "దిసిజ్ ఏపియల్, హూమ్‌డూయూ వాంట్?" అన్నాడు కాస్త విసుగ్గా.

"హలో... కెన్ యూ స్పెండ్ ఫైవ్ మినిట్స్ ఫర్‌మి" స్పష్టంగా, సున్నితంగా, సుమధురంగా మారిన ఆ అస్పష్టమైన ఆడగొంతు.

కేతన్ వళ్లంతా సన్నని సంచలనం. మాట్లాడ్డం మరిచిపోయి అలాగే ఉండిపోయాడు.

"హల్లో, కెన్‌యూ హియర్ మి?" రిప్లై లేకపోవడంతో గొంతు పెంచి అడిగింది.

"యస్, టెల్‌మి" తేరుకుని సమాధానమిచ్చాడు.

"నాకు చాలా రోజులనుండి మీ కంపెనీ గురించి వివరాలు తెలుసుకోవాలనుంది. టెలిఫోన్ డైరక్టరీ వెదికితే ఈ నంబరు దొరికింది. అందుకే ఫోన్ చేశాను. శ్రమనుకోకుండా కాస్త చెబుతారా?" ఆమె మాట్లాడే ఇంగ్లీషు చాలా బాగుంది.

"ఓ, సంతోషంగా... ఏం వివరాలు కావాలి మీకు?" ఆమెతో మాట్లాడుతుంటే, ఇంతకు ముందెప్పుడూ కలగని ఫీలింగ్.

"మీ కంపెనీలో ఏం తయారు చేస్తారు?" అడిగింది.

కేతన్ సర్దుకుని కూర్చున్నాడు, "మేము ఇక్కడ పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, కిరోసిన్ తయారుచేస్తాం"

ఆమెలో ఆసక్తి ఇంకాస్త పెరిగింది. "వాటిని ఎలా తయారు చేస్తారు?"

"మీకు క్రూడాయిల్ తెలుసు కదా?"

"ఆ... అవును, చిన్నప్పుడు చదివాను"

"క్రూడాయిల్‌ని వేడిచెయ్యడం ప్రారంభిస్తే మొదట వంటగ్యాస్ బయటికి వస్తుంది. మరికొంత వేడిచేస్తే పెట్రోల్ 'వేపర్'గా బయటికి వస్తుంది. ఆ తర్వాత కిరోసిన్, ఆ తర్వాత డీజిల్ ఇలా వేపర్‌గా బయటికి వస్తాయి."

"పెట్రోల్, డీజిల్, కిరోసిన్ ఇవ్వన్నీ లిక్విడ్స్ కదా?" మధ్యలోనే సందేహాన్ని వ్యక్తం చేసింది.

"అవును, అది మొదట వచ్చేది వేపర్‌గానే, తర్వాత వాటిని అట్మాస్ఫియర్ టెంపరేచర్‌కి కూల్‌చేస్తే లిక్విడ్స్‌గా మారిపోతాయి" వివరించాడు.

"భలేగా ఉందే!" పసిపిల్లలా సంతోషపడిపోయింది.

"ఇంకా వివరాలేమైనా కావాలా?" ఆమెతో ఇంకాసేపు మాట్లాడాలనిపించింది.

"థాంక్యూసార్, థాంక్స్ ఎలాట్... నాకీ వివరాలు చాలు, బై..." ఫోన్ పెట్టేసింది.

"నైస్ గాళ్!" అప్రయత్నంగా అతని నోటినుండి కాంప్లిమెంట్ వచ్చింది.

ఆ మరుసటిరోజు ఉదయం కేతన్, లియో, పెట్రాన్ ముగ్గురూ కలసి మషేర్ చేపని కోశారు. కేతన్ కూర వండాడు. మరికొంతమందికి ముక్కల్ని ఇచ్చారు. తనివితీరా తిని షిఫ్ట్‌కి బయలుదేరాడు. ఆరోజు కూడా 'బి' షిఫ్టే.

సాయంత్రం అయిదు. కంట్రోల్‌రూంలో కూర్చున్న కేతన్‌కి ఉదయం తిన్న చేపకూర గుర్తొచ్చింది. ఆకూరతో పాటే ముందురోజు సాయంత్రం వచ్చిన ఫోన్ గుర్తొచ్చింది. 'ఆ అమ్మాయి ఈరోజు మళ్లీ ఫోన్ చేస్తే బాగుండున'నిపించింది. వెంటనే తన రూమ్‌కి బయలుదేరాడు. అతను వెళ్లేటప్పటికి ఫోన్ రింగవుతోంది. ఆత్రంగా చేతిలోకి తీసుకున్నాడు. అటువైపు లియో స్నేహితుడు, ఫిలిప్పైన్స్ నుంచి.

000


"హలో..." ఫోనెత్తిన కేతన్ నిటారుగా అయ్యాడు... ఆమె... మషేర్ దొరికినరోజు ఫోన్ చేసిన అమ్మాయి. నెల దాటిపోయింది ఆమె ఫోన్ చేసి. అప్పుడు వారంరోజులు గుర్తొచ్చింది. ఫోన్ లేక పోయేసరికి మరిచిపోయాడు. నెలతర్వాత మళ్లీ ఇప్పుడీ ఫోన్.

"హాయ్... హౌఆర్యూ?" ఎక్సైట్‌మెంట్‌ని కంట్రోల్ చెయ్యలేకపోతున్నాడు.

"ఫైన్... థాంక్యూ" ఆ గొంతులోని తియ్యదనం మరింత పెరిగినట్లుగా అనిపించింది.

"ఆ తర్వాత మళ్లీ మీరు ఫోన్ చేస్తారేమోనని వారం రోజులు ఎదురు చూశాను" అసంకల్పితంగా అనేశాడు. వెంటనే అన్నది అర్థమై అపార్థం చేసుకుంటుందేమోనని భయపడ్డాడు.

కొన్ని క్షణాల నిశ్శబ్దం, "నేను గత మూడు వారాలుగా ప్రతి ఆదివారం సాయంత్రం అయిదుగంటలకి ఫోన్ చేస్తున్నాను. కాని వేరే ఎవరో లిఫ్ట్ చేస్తున్నారు. వెంటనే కట్ చేసేస్తున్నాను. నాకు ఆదివారం సాయంత్రం తప్ప మరెప్పుడూ ఇలా ఫోన్ చెయ్యడం కుదరదు."




లిప్తపాటు తను విన్నది అర్థంకాలేదు. అర్థంకాగానే పంచేంద్రియాలు పరవశించాయి. అప్పుడు గుర్తొచ్చింది ఆరోజు ఆదివారమని, గత మూడు వారాలూ తను 'షిఫ్ట్ ఛేంజ్' ఇచ్చాడని. ఛ... ఎంతపని చేశాడు.

ఆ విషయమే చెప్పి, మరెప్పుడూ ఆదివారం షిఫ్ట్ ఛేంజ్ ఇవ్వనని. అయిదుగంటలకి ఫోన్ దగ్గర రెడీగా ఉంటానని ప్రామిస్ చేశాడు. పావుగంట తర్వాత కంట్రోల్‌రూం నుండి కాల్ వచ్చేవరకూ వాళ్లిద్దరూ మాట్లాడుకుంటూనే ఉన్నారు.

ఒకరి వివరాలు ఒకరికి తెలిశాయి. ఆమె తండ్రి పెద్ద వ్యాపారవేత్త, ఏకైక గారాల కూతురు, బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్స్ చదువుతోంది.

పేరు... సహారా!!!

రెండు సంవత్సరాలు రెండు గంటల్లా గడిచిపోయాయి. ప్రతిఆదివారం అయిదుగంటలకి తప్పని సరిగా ఫోన్ చేసేది. కానీ కేతన్‌కి మాత్రం ఫోన్ చేసే అవకాశమే లేదు. పరాయి మగాడి దగ్గర్నుండి ఫోన్ వచ్చిందని తెలిస్తే ఇక పర్యవసానం దారుణంగా ఉంటుంది. ఆదివారం కోసం ఎదురుచూడటం ఎంతో థ్రిల్లింగ్‌గా, ఎక్సైటింగ్‌గా ఉండేది. ఆ ఎదురుచూపులు తన కాంట్రాక్ట్ ముగియబోతుందన్న విషయం కూడా గుర్తులేదు. నెలరోజుల క్రిందట కేతన్‌ని రిక్రూట్ చేసుకున్న కన్సల్టెన్సీ నుంచి లెటర్ వచ్చినప్పుడు మాత్రమే ఆ విషయం గుర్తొచ్చింది.

విషయం తెలిసిన ఇద్దరూ హతాశులయ్యారు. కేతన్ కావాలనుకుంటే కాంట్రాక్ట్ పొడిగించుకోవచ్చు. కానీ ఎంతకాలం అక్కడ ఉండిపోతాడు. సహారాతో ఫోన్‌లో తప్ప మాట్లాడ్డం కుదరదు. అదీ ఆమె ఫోన్ చేస్తే. అంతకంటే ముందుకెళ్లడం అసాధ్యం. అతని తల్లిదండ్రులు అతని రాకకోసం ఎదురుచూస్తున్నారు. ఇండియా వెళ్లిపోవడానికే నిర్ణయించుకున్నాడు. తను వెళ్లేలోపు ఒకచిన్నకోరికను తీర్చమని సహారాని అర్థించాడు. అది... సహారాని ఒకసారి ప్రత్యక్షంగా చూడడం.

అతని కోరిక విని సహారా హడలిపోయింది. చివరికి ఒకసారైనా ఒకరినొకరు చూసుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. ఆఖరి ఆదివారం కేతన్‌తో మాట్లాడినప్పుడు శుక్రవారం లేడీస్ మార్కెట్‌కి వస్తానని జాగ్రత్తగా రమ్మని చెప్పింది.

శుక్రవారం సాయంత్రం లేడీస్ మార్కెట్‌కి చేరుకున్న కేతన్, సహారా చెప్పిన షాప్ పేరుకోసం వెదికాడు. దూరంగా 'ముజఫర్ జ్యూయలర్స్' కనిపించగానే కాళ్లు వణికాయి. గుండెవేగం పెరిగింది. తనమీద ఎవరికి అనుమానం రాకూడదన్న విషయం గుర్తొచ్చి సాధ్యమైనంత మామూలుగా ఉండడానికి ప్రయత్నించాడు.

టైం చూస్తే సహారా చెప్పిన ఆరుగంటలకి ఒక్కనిమిషం తక్కువ. ముజఫర్ జ్యూయలర్స్‌కి ఎదురుగా ఒకపార్లర్ కనిపించింది. నిదానంగా దానిలోకి నడిచాడు.

"మహ్‌రబా..." ఓనర్ ఆహ్వానించాడు.

కేతన్ జ్యూయలర్స్ షాపు కనిపించే విధంగా కూర్చున్నాడు. సర్వర్‌కి 'కువ్వు' ఆర్డరిచ్చాడు. జ్యూయలర్స్‌తోపాటు దానికి కుడివక్క, ఎడమప్రక్క ఉన్న రెండు టెండరింగ్ మెషిన్‌లు కూడా కనిపిస్తున్నాడు. కుడివక్క ఉన్న టెండరింగ్ మెషినే సహారా నిలబడి ఉంటానన్న చోటు. అక్కడ ఎవరూ కనిపించలేదు.

కువ్వు రాగానే కాస్త నిదానంగా తింటూ, అటువైపే చూస్తూ కూర్చున్నాడు. తర్వాత కాఫీ త్రాగాడు. అప్పటికీ సహారా కనిపించలేదు. బిల్‌పేచేసి జ్యూయలర్స్‌కి ఎడమ ప్రక్కనున్న టెండరింగ్ మెషిన్ వైపు నడిచాడు. జేబులోనుండి ఒక రియాల్‌కాయిన్ బయటికి తీసి ఆ మెషిన్‌లో వేశాడు. వెంటనే డ్రింక్ పైకొచ్చింది. ఆ డ్రింక్ చేతిలోకి తీసుకున్నాడు.

డ్రింక్ తాగుతూ టైం చూశాడు. ఆరుదాటి అరగంట. 'రావడానికి వీలు పడలేదేమో?' అన్న ఆలోచన రాగానే అంతులేని నిస్పృహ ఆవహించింది. ఒకరిద్దరు అతనివైపు అనుమానంగా చూస్తున్నట్లనిపించి గుండెవేగం మరింత పెరిగింది. డ్రింక్ తాగుతున్నా చల్లదనం తెలియడం లేదు.

ఇంతలో ఒక 'సీలో' కారొచ్చి ఆగింది. సహారా సీలో కారులోనే

వస్తానని చెప్పింది. ఆత్రంగా నంబర్ చూశాడు.. యస్... ఆ నంబరే. నవనాడులూ ఉద్వేగంతో నిండిపోయాయి. నెమ్మదిగా డోర్ తెరుచుకుంది. బుర్ఖాలో ఉన్న ఇద్దరు స్త్రీలు దిగారు. ఒకరు జ్యూయలర్స్‌లోకి వెళ్లగా, మరొకరు కేతన్‌కి ఎదురుగా ఉన్న టెండరింగ్ మెషిన్ దగ్గరికి నడిచారు. అతనిలోని అణువణువూ ఎలర్టయ్యింది.

మెషిన్ దగ్గర కెళ్లినామె పర్సులో నుండి రియాల్ కాయిన్ తీసి లోపలికి జారవిడిచింది. బయటికి వచ్చిన డ్రింక్ తీసుకుని నోటికి అందించుకోబోతూ అలవోకగా మొహంమీద బురఖాని వెనకేసుకుంది.

వేయి చంద్రుల వెలుగు, కోటి సూర్యుల కాంతి, శతకోటి సన్నజాజుల పరిమళం ఒక్కసారిగా కేతన్‌ని చుట్టుముట్టాయి. ఆమె పర్సు నెమ్మదిగా జారి క్రిందపడింది.

అప్పుడు కనిపించాయి, ఆ పర్సుమీది 'సహారా' అనే బంగారురంగుఇంగ్లీషు అక్షరాలు, అందంలో యజమానురాలికి పోటీపడుతున్నట్లుగా!

ఇద్దరి కళ్లు కలుసుకున్నాయి... ఆ చూపులు... స్నేహంగా... ప్రేమగా... అభిమానంగా... ఆత్మీయంగా... అనురాగంగా.... అనుబంధంగా... ఆర్ద్రంగా... ఏడురంగుల ఇంద్రధనస్సుగా మారి, ఇంద్రధనస్సు సృష్టికి తామే కారణమని విర్రవీగే మేఘమాలికన్ని ఛిన్నుల్ని చేశాయి. అస్తమిస్తున్న సూర్యుడు ఆ అద్భుతాన్ని చూసి అక్కడే ఆగి అంబుదాల వైపు అవహేళనగా, మీ గర్వభంగం అయ్యింది సుమా అన్నట్లుగా చూశాడు.

"సహారా, ఎంతసేపు డ్రింక్ తాగేది?" జ్యూయలర్స్‌లో నుండి బయటికి వచ్చిన స్త్రీ అరబిక్‌లో అడిగింది. ఇద్దరూ ఉలిక్కిపడి వాస్తవంలోకి వచ్చారు.

"అయిపోయిందమ్మా... వస్తున్నా!"

'నేస్తమా, దేశాలు దాటొచ్చిన నువ్వు నాకెందుకు తారసపడ్డావు?... నామదిలో, హృదిలో, ఆలోచనల్లో ఎందుకు మమేకమయ్యావు?... మురిపించి, మరిపించి, స్నేహించి, ప్రేమించి అంతలోనే ఎందుకు దూరమవుతున్నావు?... మిత్రుడా... నీ ఎడబాటుని ఈ చిన్నిగుండె తట్టుకునేదెలా? ఈ సున్నితమైన హృదయం తునాతునకలు కాకుండా ఆపేదెలా?'

కారులో కూర్చోబోతున్న సహారా కంటినుండి ఓ బరువైన అశ్రుబిందువు నేలరాలి వేలముక్కలయ్యింది.

000

"వాట్ హేపెన్డ్ సార్, ఆర్‌యూ ఆల్‌రైట్?" తడికళ్లతో కనిపించిన కేతన్‌ని ఎయిర్‌హోస్టెస్ అడిగింది.

వర్తమానంలోకొచ్చిన కేతన్ కర్చీఫ్‌తో కళ్లు తుడుచుకున్నాడు.

"హేవ్ ఎ డ్రింక్ సర్..." ట్రేలో ఉన్న డ్రింక్ ఆఫర్ చేసింది.

"నో... థాంక్యూ" సున్నితంగా తిరస్కరించాడు. అతనికేమీ తాగాలనీ, తినాలనీ అనిపించడం లేదు. మనస్ఫూర్తిగా భోజనం చేసి చాలా రోజులయ్యింది.

ఆమె వెళ్లిపోయిన తర్వాత చూస్తే అతని ప్రక్కన ఒక కవరు పడివుంది. డ్రింక్ అందివ్వబోతున్నప్పుడు ట్రేలో నుండి పడినట్లుంది. తిరిగి ఇచ్చేద్దామని చేతిలోకి తీసుకున్నాడు. నిలబడి ఎయిర్‌హోస్టెస్‌ని పిలువబోతుంటే ఎందుకో దృష్టి కవర్‌మీది అక్షరాలమీదకి మళ్లింది.

'ప్రేమతో,
కేతన్‌కి...'

అందమైన అక్షరాలు. కలోనిజమో అర్థం కాలేదు. మళ్లీ చదివాడు. నిజమే, అది తనకే, ఓపెన్ చేశాడు...

ఓ నా ప్రాణమా....

ఎందుకలా వేదనతో వడిలిపోతున్నావు. మనోవేదనతో మరిగిపోతూ చిక్కిశల్యమవుతున్నావు. కలలా స్నేహితులమయ్యాం, అదే కలలా విడిపోతున్నాం. అసలు జీవితమే పెద్దకల కదా!... మన ఎడబాటు నన్నూ చిత్రవధ చేసింది. కానీ, ఆలోచిస్తే... 'మోసానికీ, ద్వేషానికీ, వంచనకీ, కుట్రలకీ ముగింపు విషాదం కావచ్చేమో కానీ ఆ భగవంతుడు ఈ ప్రాణికోటి కళ్యాణం కోసం సృష్టించిన ప్రేమకీ, స్నేహానికీ ముగింపు కాకూడదు' అనిపించింది.

అలా జరిగితే ఆ సృష్టికర్తకే అవమానం. నీకునేనూ, నాకునువ్వు గుర్తొస్తే మనం సంతోషసాగరంలో మునిగి తేలినంతగా సంతోషపడాలి. కర్తవ్యోన్ముఖులమై మన జీవితకాలంలో ఒక మనిషి నిజంగా ప్రయత్నిస్తే సాధించగలిగే దానికి ఏమాత్రం తగ్గకుండా మన లక్ష్యాలను సాధించాలి. అదే నిజమైన ప్రేమ. అదే నిజమైన స్నేహం.

నీ లక్ష్యారోహణలో నువ్వు, నా కలల వాస్తవీకరణలో నేనూ ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ పోతుంటే ఆ విజయగాథలు మేగజైన్స్‌లో చదివో, టివిలో చూసో 'నా నేస్తం ఎంత చక్కగా ఈ అద్భుతమైన జీవితాన్ని సాఫల్యం చేసుకుంటోంది.' అని మనం ఉప్పొంగిపోవాలి. అదే మన స్నేహానికి మనమిచ్చే ప్రతిఫలం. మనప్రేమకి సాఫల్యం...

మిత్రమా.... అర్థం చేసుకుంటావు కదూ....

నా ప్రియనేస్తానికి ప్రేమతో....

'సహారా'

కేతన్ కళ్లని ఆనందబాష్పాలు ఆక్రమించుకున్నాయి. అప్పటివరకూ గుండెను మండించిన మంట వెచ్చని వెలుగుగా మారి లక్ష్యసాధనకి మార్గాన్ని చూపిస్తోంది. వేదన, వర్తమానం మీద ఉత్సాహంగా, విరక్తి, జీవితం మీద వ్యామోహంగా పరివర్తన చెంది మనసంతా తేలికైంది.

కాక్‌పిట్ నుండి ఎనౌన్స్‌మెంట్... దాని సారాంశం.... ముంబైలో విమానం లాండ్ కాబోతోంది. ఇండియన్ స్టాండర్డ్ టైం ప్రకారం సమయం అయిదుగంటలు.

జుబైల్ నుండి ముంబైకి రెండున్నర గంటల ప్రయాణం. సౌదీకి ఇండియాకి టైంలో తేడా రెండున్నర గంటలు. అందుకే బయలుదేరిన టైంకే ఇండియా చేరుకున్నాడు.

మళ్లీ ఆదివారం, మళ్లీ సాయంత్రం అయిదుగంటలు... మళ్లీ ఆ టైం ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని కలిగిస్తోంది.

కేతన్ తన వాచీలో టైంని 'అయిదు'కి ఎడ్జస్ట్ చేస్తూ విమానం దిగాడు.

ఎదురుగా పెద్దపెద్ద అక్షరాలు...

'సహారా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, ముంబై'

కేతన్‌కి సహారా స్వాగతం చెప్పింది. ■

